


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

11 నవంబర్ 2025 పేజీలు : 08


# ఎమ్మెల్యే అధికారాలకు.. కత్తెర






**ప్రభుత్వ పెద్దల నుంచి ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు !**

కావలి, మేజర్‌న్యూస్ :

కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో అసలు ఏమి జరుగుతుంది. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షాలు, అధికార పార్టీ కూడా కావలిలో ఏమి జరుగుతుందనేది ప్రతి ఒక్కరికి మిలియన్ డాలర్ల ప్రశ్న ? కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి కుటుంబ మధ్య నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుందని చెప్పవచ్చు. మంత్రి లోకేష్ మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించిన తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. కావలి పట్టణంలో ఏ ప్రదేశంలో ఎవరు మాట్లాడినా.. ఇది ఒక చర్చనీయాంసమైన అంశంగా మారడం విశేషం. నవంబర్ 19 తేదీన మాలేపాటి కుటుంబ సభ్యులను సీఎం నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కూర్చోబెట్టి పరిస్థితిని బట్టి చర్యలు ఉంటాయని మంత్రి లోకేష్ తెలిపిన విషయం తెలిసిందే. అయితే అంతకంటే ముందుగానే జిల్లా ఉన్నతాధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి ఎమ్మెల్యేని కట్టడి చేసే అంశంపై మౌఖిక ఆదేశాలు అందినట్టు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా దగదర్తి నిరసన సంఘటనలో పాలుపంచుకున్న వ్యక్తులపై పెట్టిన కేసులను ఎత్తివేసే విషయంలో ఏకంగా పోలీస్ బాస్ అయిన డీజీపీ జోక్యం చేసుకున్నట్లు సమాచారం. అలాగే ఈనెల 19న -మిగతా 2లో

# రూ.కోటి స్థలం హాంఫట్ !





**పొదలకూరు పట్టణంలో కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వం ఏదైనా అధికారులు మాత్రం తమ పందాను మార్చుకోవడం లేదు. మామూళ్ళ మత్తులో జోగుతుండటంతో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు యదేచ్చగా ఆక్రమణకు గురవుతున్నాయి. తాజాగా ఇలాంటి కబ్జానే పొదలకూరు పట్టణంలో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.**

- డొంక పోరంబోకు స్థలం కబ్జా !
- మామూళ్ళ మత్తులో రెవెన్యూ అధికారులు
- ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

పొదలకూరు, మేజర్‌న్యూస్ :

పొదలకూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారితోపాటు పొదలకూరు – నెల్లూరు రహదారి వెంబడి ధరలు రూ.లక్షల నుంచి రూ.కోట్లలో పలుకుతున్నాయి. తోడేరు పంచాయతీలోని భూములు పొదలకూరు – నెల్లూరు రోడ్డుతోపాటు సంగం రోడ్డు కూడలి వరకు విస్తరించి ఉండటంతో ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ క్రమంలో ఓ వ్యక్తి టైలర్స్ కాలనీ సమీపంలో దుకాణ సముదాయం పక్కన మెయిన్ రోడ్డు ఆనుకుని కొంత మేర స్థలం ఆక్రమించి రేకులు వేశాడు. అలాగే మెయిన్ రోడ్డు నుంచి వీవర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న డొంక పోరంబోకు స్థలం సుమారు 40 అంకణముల వరకు ఆక్రమించి -మిగతా 2లో

## తిరుమల లడ్డూ కల్తీ కుట్రదారుల పాపం పండుతోంది

- కోట్లాది మంది భక్తుల సెంటిమెంటును దెబ్బతీసిన పాపాత్ములు ఫలితం అనుభవించకతప్పదు
- మీడియాతో ఎమ్మెల్యే సోమిరెడ్డి



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి ప్రసాదం పవిత్రతను భ్రష్టుపట్టించిన వారి పాపాలు పండుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.

వివరాలు 2లో

02

## వీపీఆర్ కృషితో.. ఏళ్ల కల.. నెరవేరిన వేళ

*నిత్యం ట్రాఫిక్ సమస్యలు.. తరచూ రోడ్డు ప్రమాదాలు.. రహదారి దాటాలంటే డేంజర్ బెల్స్.. ఇది ఇప్పటివరకు జాతీయ రహదారి - 16పై చింతారెడ్డిపాలెం జంక్షన్ పరిస్థితి. ఇకపై ఆ పరిస్థితుల్లో మార్పులు రానున్నాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అవిశ్రాంత శ్రమతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి - 16 చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్‌పాస్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకోసం ఏకంగా రూ.115 కోట్లు కేటాయించింది. ఇన్నాళ్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పడిన కష్టానికి ఫలితం దక్కినట్లయింది. దాంతో స్థానిక ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు నిత్య శ్రామికుడిలా పనిచేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నారు.* – నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :



డిసెంబర్ 18, 2024న ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

## అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ హిమాన్శు శుక్ల**



పలు సమస్యల పరిష్కారం కోసం.. జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్శు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

07

# ఏళ్ల కల.. వీపీఆర్ కృషితో నెరవేరిన వేళ

- జాతీయ రహదారి 16పై చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు 115 కోట్ల మంజూరు
- విపిఆర్ అనుకుంటే సాధించి తీరతారని మరోసారి రుజువైంది
- గతంలో నిత్యం ట్రాఫిక్, ప్రమాదాలతో అవస్థలు పడే ప్రజలు
- ఇకపై ప్రమాదాలకు తావుండదు.. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేదు
- చింతారెడ్డిపాలెం జంక్షన్ నుంచి ముత్తుకూరు రోడ్డువరకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల ఏర్పాటు
- సీఎం చంద్రబాబుకు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ వేమిరెడ్డి
- వేమిరెడ్డి కృషి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఎంపీగా గెలిచినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో జాతీయ రహదారులపై ఉన్న సమస్యలు, చింతారెడ్డిపాలెం వద్ద వెహికల్ అండర్‌పాస్ ఏర్పాటు వంటి అంశాలపై కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో 4 దఫాలు ఢిల్లీలో భేటీ అయి మాట్లాడారు. తొలిసారి జులై 24, 2024న ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. చింతారెడ్డిపాలెం జంక్షన్ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే జులై 25న ఇదే సమస్యను లోక్‌సభలో ప్రస్తావించారు.

అనంతరం సెప్టెంబర్ 5, 2024న కేంద్ర రహదారుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ సారంగితో భేటీ అయి సమస్యను వివరించారు. అలాగే నవంబర్ 27, 2024న ఒకసారి, డిసెంబర్ 18, 2024న మరోసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఇటీవల ఆగస్టు 18న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. జిల్లాలో జాతీయ రహదారుల సమస్యల పరిష్కారం, వెహికల్ అండర్‌పాస్ ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించారు.

**నిత్యం భయం.. భయం.. ఎట్టకేలకు అభయం !**

జాతీయ రహదారి-16 నుంచి నెల్లూరు నగరంలోకి ప్రవేశించేందుకు చింతారెడ్డి పాలెం జంక్షన్ చాలా కీలకమైంది. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు ఈ జంక్షన్ గుండా వెళ తుంటాయి. సమీపంలోనే ప్రముఖ మెడికవర్ హాస్పిటల్ ఉంటడంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు ఈ జంక్షన్ ద్వారానే రాకపోక లు సాగిస్తుంటారు. ఇంతటి కీలకమైన జంక్షన్ ట్రాఫిక్‌కు ప్రధాన అడ్డంకిగా ఉంటూ.. ప్రమాదా లు జరుగుతుంటాయి. దాంతో ఇక్కడ వెహికల్ అండర్ పాస్ కోసం ప్రజల నుంచి భారీ డిమాం డ్ ఉంది. దీని ప్రాధాన్యతను, ప్రజల డిమాండ్‌ను గుర్తించిన ఎంపీ వేమిరెడ్డి.. పట్టువిడువని విక్ర మార్కుడిలా కేంద్ర మంత్రిని పలుమార్లు కలిశా రు. జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు కు ఒప్పించి 115 కోట్ల నిధులు మంజూరు చేయించేలా శ్రమించారు. దాంతోపాటు ప్రతిపా దిత చింతారెడ్డిపాలెం జంక్షన్ వెహికల్ అండర్ పాస్ నుంచి ముత్తుకూరు రోడ్ వరకు జాతీయ రహదారి - 16కు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు.

**సీఎం, కేంద్ర మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు :**

చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి, సీఎం చంద్రబాబు నాయుడుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇన్నాళ్లకు ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని చెప్పారు. ఇకపై ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల బెడత తప్పుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా క్షేమమే ధ్యేయంగా మరింత ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రమాదాల నివారణతో పాటు రాక పోకలకు సులువుగా ఉంటుందని, భయం గుప్పి ట్లో బతుకుతున్న తమకు.. అభయం దొరికిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కలను నిజం చేస్తున్న ఎంపీ వేమిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తిరుమల లడ్డూ కల్తీ కుట్రదారుల పాపం పండుతోంది

- కోట్లాది మంది భక్తుల సెంటిమెంటును దెబ్బతీసిన పాపాత్ములు ఫలితం అనుభవించకతప్పదు
- మీడియాతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి ప్రసాదం పవిత్రతను భ్రష్టుపట్టించిన వారి పాపాలు పండుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవాలను జీర్ణించుకోలేక అడ్డగోలుగా వార్తలు వండి వారుస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో లీటర్‌కు రూ.20 కమీషన్ తీసుకుని కల్తీ నెయ్యిని సరఫరా చేయిం చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నిం చారు. ఒక్క లీటర్ పాలు కొనుగోలు చేయని బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చేయడం అవినీతిలో భాగమేన న్నారు. జగన్ రెడ్డికి హిందూ దేవుళ్లంటే నమ్మకం లేదని, వైవీ సుబ్బారెడ్డిదీ అదే పరిస్థితి అని వింటుంటామన్నారు. ఈ క్రమంలోనే తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిపోయిందన్నారు. సీబీఐ విచారణతో నిర్ఘాంతపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. వాస్తవాలను జీర్ణించుకోలేక వారి పత్రికలో రివర్స్ రాతలకు పనిపెట్టారన్నారు. ఈ పత్రికలో మీకు అనుకూలంగా ఇష్టానుసారం వార్తలు రాసుకున్నంత మాత్రాన పాపాలు చెరిగిపోవని గుర్తుంచుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాలు, లావాదేవీల వివరాలను సిట్ కోరితే.. వైవీ సుబ్బారెడ్డి కోర్టుకు ఎందుకెళ్లారు.. కుట్రలు చేయకపోతే అంత భయ మెందుకని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ అంటే కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్ అని, ఆ సెంటిమెంట్ ను దెబ్బతీసిన వారు ఫలితం అనుభవించక తప్పని పరిస్థితి వస్తుందన్నారు. ఏఆర్ డెయిరీకి అర్హత లేకపోయినా.. నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇవ్వడం కుంభకోణంలో భాగమేనన్నారు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, రోజా, చెవిరెడ్డి తదితరులందరూ ధర్మారెడ్డి సహకారంతో వేల దర్శన టికెట్లు అడ్డగోలు గా పొంది సంతలా మార్చేశారన్నారు. ప్రస్తుతం బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో అంతా నిజాయితీతో జరుగుతోందని, కోటా కు మించి ఒక్క లెటర్‌ను అనుమతించే పరిస్థితి లేదన్నారు. వెంకటేశ్వర స్వామికి అంకితమై బీఆర్ నాయుడు సేవలు అందిస్తు న్నారన్నారు. టీటీడీని అంకితభావంతో పనిచేసే లా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు సేవ చేయడం కోసం అప్పట్లో అలిపిరి ఘటనలో చంద్రబాబు నాయుడిని వెంకటేశ్వరస్వామి బతికించారన్నారు. ఏడుకొండల వెంకన్న మహత్యానికి అదే నిదర్శనం పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే అధికారాలకు కత్తెర ?

(మొదటి పేజీ తరువాయి)

జరిగే సమావేశంలో మాలేపాటి కుటుంబంతో పాటు ముసునూరు శ్రీహరి నాయుడు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవి చంద్ర ఇంకా కొంతమందిని కూడా రావాల్సిందిగా పార్టీ అధిష్టాన పెద్ద ల నుంచి సమాచారం అందుకున్నట్లు పలువురు చెబుతున్నారు. ఒకవే ళ మాలేపాటి కుటుంబం, ఇతర నేతల వాదనలో వాస్తవాలు ఉండి, ప్రస్తుత సంక్షోభానికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కారణమైతే మాత్రం కఠిన చర్యలు ఉంటాయని మాలేపాటి వర్గీయులు చెబుతుండడం విశేషం. చర్యలు అనివార్యమైతే మాత్రం పార్టీ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీ బీద మసాన్‌రావును ఇన్చార్జి హెూదాలో ముందుకు తేనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ అయితే నడుస్తుంది. ఏది ఏమైనా మరొక పది రోజుల్లో కావలి అధికార పార్టీ రాజకీయ ముఖచిత్రంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకోవడం విశేషం.

# రూ. కోటి స్థలం హాం ఫట్..




(మొదటి పేజీ తరువాయి)

పెన్సింగ్ రాళ్లు నాటాడు. ఆ స్థలం పక్కనే ఉన్న స్వర్ణ లేఅవుట్‌లో ఒక అంకణం రూ.3 లక్షల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఆక్రమణ స్థలం విలువ దాదాపు కోటి రూపాయలుపైన ఉంటుంది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతుండటంతో అక్రమణల పర్వం యదేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొదలకూరు పట్టణంలో అధికార పార్టీ నాయకులకు తెలియకుండా ఏమీ జరగదని, ఒకరిద్దరు అధికార పార్టీ నాయకుల ప్రమేయంతోనే విలువైన ఈ స్థలం కబ్జాకు గురవుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గడిచిన వారం రోజులుగా ఏ 'టీ'స్టాల్ దగ్గర ఒకరిద్దరు కూర్చొన్నా.. ఇదే విషయమై చర్చించుకోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు చేపట్టి విలువైన స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం - తహసిల్దార్ శివకృష్ణయ్య**

పొదలకూరు పట్టణంలోని వీవర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో డొంక పోరం బోకు స్థలం ఆక్రమణకు గురైందన్న విషయం తమ దృష్టికి కూడా వచ్చింది. విచారించి అక్రమార్కు లపై చర్యలు తీసుకుంటాం.

# బ్లడ్ క్యాంపు విజయవంతం

**ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపిన భాస్కర్‌నాయుడు**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు డైకాస్ రోడ్డు సమీపంలోని క్యాంపు కార్యాలయంలో ముత్తుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో దువ్వూరు కృష్ణ తేజ రెడ్డి, సీపారెడ్డి జానకిరామ్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నోవా బ్లడ్ బ్యాంకు మోపూరు భాస్కర్ నాయుడు తెలిపారు. కాకాని నివాసం వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 504 మంది రక్తదానం చేశారని వివరించారు. యువత నుంచి పెద్ద ఎత్తున ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారన్నారు.

రక్తదాన ఉద్యమంలో యువత ప్రాధాన్యతను గుర్తు ఉంచుకొని ఈ క్యాంపును ఏర్పాటు చేయటం ఎంతో ఆనందదాయకమన్నారు. తమకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో దూడల సుధీర్, బావిశెట్టి వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు,

# ఎర్రగుంటలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఎర్రగుంటలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్–4 ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం మూడవ రోజు విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా వాలంటీర్లు ప్రాథమిక పాఠశాలలో విద్యా ర్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార ప్రాము ఖ్యతపై అవగాహన కల్పించారు. పప్పు దినుసుల ద్వారా లభించే పోషక విలువలను డెమో రూపం లో వివరించారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలను అనుసరించి హ్యాండ్‌వాష్ ప్రదర్శన నిర్వహించి, పరిశుభ్రంగా చేతులు కడు క్కోవడం ఎలా అనే అంశాన్ని విద్యార్థులకు చూపించారు. ఫిజికల్ ఫిట్నెస్‌కి తోడ్పడే ఆటలను కూడా నిర్వహించారు. రేపు జరగబోయే ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలందరూ సద్వి నియోగం చేసుకోవాలని వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లపు మునిస్వామి సందర్శించి వాలం టీర్ల సేవా కార్యక్రమాలను అభినందించారు. శిబిర సమన్వయకర్తగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటసుబ్బారెడ్డి వ్యవహరిం చారు. కెమిస్ట్రీ, ఎంబీఏ, టూరిజం, సోషల్ వర్క్ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన నిలయం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రఖ్యాత గ్రంథాలయమైన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంను చరిత్రకారులు సందర్శించి సమాజాన్ని మేల్కొల్పాలని కావలి శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. కడప జిల్లా కేంద్రంలో ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోనిది దీనిని మాలకొండరెడ్డి, కడప జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఆకిమ్ హజరత్ రెడ్డి సందర్శించినారు. వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ దొర

## సామాజికవేత్త మాలకొండ రెడ్డి

సీపీ బ్రౌన్ తెలుగు భాషకు వన్నె తేవాలని వేమన పద్యాలకు విశిష్టమైన ప్రాధాన్యత కల్పించాలని ఎంతగానో కృషి చేసినారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవలు అందించిన సీపీ బ్రౌన్ ఆయన తెలుగు భాషకు అద్భుతమైన సేవలు అందించారని తెలిపారు. ఆయన తెలుగు సాహిత్యాన్ని సంరక్షించి తెలుగు శాస్త్రీయ గ్రంథాలు ప్రచురించారని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ గ్రంథాలయంలో చరిత్ర పురాతన గ్రంథాలు, భారతం, భాగవతం, అద్భుతమైన అనేక గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. మేధావులు రచయితలు తెలుగు భాషాభిమానులు పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు పొందేవారు ప్రఖ్యాత సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజానికి అందజేయాలని కోరినారు. మాలకొండ రెడ్డి తోపాటు కడప జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌రెడ్డి అక్కు హజరత్‌రెడ్డి సందర్శించి గ్రంథాలయ అధికారుల నుంచి విలువైన సమాచారాన్ని తెలుసుకొని ఈ గ్రంథాలయం యొక్క విశిష్టతని తెలుసుకున్నారని తెలిపారు.

# మార్కండేయపురం పాఠశాలలో బట్టలు పండ్లు వితరణ



**కావలి, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలం మార్కండేయ పురం పాఠశాలలో సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు, గ్రామస్తులకు బట్టలు, పండ్లు, ఆహారాన్ని పంపిణీ చేశారు. విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ మనుమరాలు పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో నివసిస్తున్న పేద గిరిజనులు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుట్టినరోజు ఇటువంటి కార్యక్రమాన్ని జరపడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పిల్లలు మంచి చదువులు చదివి ఉజ్వల భవిష్యత్తుని అందించాలని, చదువు అనేది విద్యార్థిని, విద్యార్థులను ఎంతో ఉన్నత స్థితికి తీసుకు వెళుతుందని విద్య అనేది వజ్రాయుధం లాంటిదని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు పిల్లలను బాధ్యతగా చదివించాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తప్ప తమ సొంత నిధులతో పాఠశాలలో జెండా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. సత్తన్న నారాయణ పద్మావతి దంపతుల చేసిన దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రామకృష్ణారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ ఆయా ఏ.చిన్నమ్మ, అలహరి జయమ్మ, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సైదాపురం మండలం తుమ్మల తలుపులు పంచాయతీలో చెరువుకు దగ్గరలో స్మశాన వాటిక సమీపాన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికల కథనం మేరకు ఉరి వేసుకున్న వ్యక్తి మోచర్ల వనయ్య వయసు సుమారు 52 మధ్యలో ఉంటాయని తెలిపారు. ఈ మోచర్ల వనయ్య వ్యక్తి తుమ్మల తలుపులు హరిజనవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు కొరకు తరలించారని స్థానికుల సమాచారం.

# మెరుగైన ఫలితాలు సాధించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సమ్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ–1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రశ్నపత్రాలను విద్యార్థులకు ఇచ్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరీక్షల అనంతరం వీలైనంత త్వరగా వారి వద్ద నుంచి అసెస్మెంట్ బుక్లెట్ను తీసుకొని మార్కులు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అలాగే పట్టణంలోని బీసీ కాలనీ ఆదర్శ పాఠశాలను ఎంఈఓ–2 టీ.శ్రీనివాసులు సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో రైతులకు యూరియా పంపిణీ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పుంజులూరుపాడు, కురిచర్లపాడు గ్రామాల్లో రైతులకు యూరియా, యూరియా కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చౌటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరు రాధాకృష్ణమనాయుడు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతి రైతుకీ యూరియా అందజేస్తున్నామన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదు. సర్వేపల్లి నియోజకవర్గ రైతుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, మండల వ్యవసాయ అధికారి హరి కరుణాకర్ రెడ్డి, స్థానిక నాయకులు కొణిదన వెంకటకృష్ణమ నాయుడు, జగన్ మోహన్ నాయుడు, మల్లికార్జున, గోపి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, వేణుగోపాల్, బీజేపీ సుబ్బులు నాయుడు, చక్రి, గిరి నాయుడు, రామమూర్తి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువలలో పూడిక, గుర్రపు డెక్క తొలగించాలి

● జిల్లాలో నీటి నిర్వహణకు లస్కర్ల నియామకం చేయాలి



**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జలవనరుల శాఖ పరిపాలనాధికారి కృష్ణయ్యకు వినతిపత్రం. సమర్పించారు. కాలువలలో పూడిక తీయకుండా గుర్రప్ప డెక్క తొలగించకుండా గండ్లు పోల్చకుండా నీరు విడుదల చేయడం మంచి పరిణామం కాదని బీజేపీ నేత మిడుతల రమేష్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో నీటి నిర్వహణకు కనీసం 350మంది లస్కర్ల నియామకం చేయాలి. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, బుధవరపు బాలాజీ, టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాలవుల మరమత్తులకు గుర్రపుడెక్క తొలగించేందుకు జిల్లాకు వంద కోట్లు నిధులు అవసరం. జిల్లాలోని పంట కాలువలు సాగునీటి కాలువలకు గండ్లు పడి ఉన్నాయి. శాశ్వత మరమ్మత్తులు చేయకుండా ఇసుక బస్తాలతో కాలం నెట్టుకుంటూ వస్తున్నారు. నీటి వృథా నివారణగండ్లు పూడ్చాలి. గుర్రపు డెక్క తొలగించాలి. పూడిక తీయాలి. ఈ సమస్యలు పరిగణలోకి తీసుకోకుండా నీరు విడుదల చేస్తే రెండు టీఎంసీల నీటి వృథా జరుగుతుంది. 20 కోట్ల రూపాయలు విలువ చేసి నీటి నష్టం జరుగుతుంది. చివరి ఆయకట్టు రైతాంగానికి మీ చివరి ఆయకట్టు రైతాంగానికి నీరు అందదని పరిపాలనాధికారి కృష్ణయ్యకు వివరించారు.

# జలదంకిలో స్వచ్ఛ ఆంధ్ర' 'స్వర్ణాంధ్ర'కు అపహాస్యం!

● పేరుకే సిమెంట్ రోడ్డు నడవాలంటే అవస్థలు ● రజకుల ఆవేదన







**కావలి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల కేంద్రమైన జలదంకిలోని రజకుల బజారు మురికి కూపంగా మారి అధ్వానంగా ఉందని స్థానికులు, ముఖ్యంగా రజకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని వారు మండిపడుతున్నారు. బజారులో ఉన్నది పేరుకు మాత్రమే సిమెంట్ రోడ్డు అని, వాస్తవానికి అది మురికి, బురదతో నిండిపోయిందని రజకులు తెలిపారు. ఆ రోడ్డుపై నడవాలంటేనే నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర', 'స్వచ్ఛ ఆంధ్ర' వంటి నినాదాలు ఇస్తున్నా, ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా మురికి పేరుకుని పోయిన పేడ దిబ్బలు దర్శనమిస్తున్నాయి. వర్షాలు వచ్చినప్పుడు నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలిచి, ఆ నీరు మురికిగా మారి దోమలకు నిలయంగా తయారవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య గురించి అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రజకులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఇదే పరిస్థితితో ఇబ్బంది పడ్డామని, కనీసం ఈ ప్రభుత్వంలోనైనా సమస్యను పరిష్కరించాలని అన్నారు.

తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని జలదంకి ప్రజలు కోరుతున్నారు.

## వేలంతో పంచాయితీకి రూ.7.21లక్షల ఆదాయం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండల కేంద్రంలో ఉన్న శ్రీ ఖాజా నాయబ్ రసూల్ స్వాముల వారి దర్గాకు వచ్చే వాహనాలకు వసూలు చేసే పంచాయతీ రుసుముకు సంబంధించి వేలం పాటను సోమవారం డిప్యూటీ ఎంపీడీవో మునీరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంపాటకు పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరుకాగా అందులో ఐదుగురు ఒక్కొక్కరు 20వేల రూపాయలు ధారావతు సొమ్మును చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. పంచాయతీ పాట 5,86,000 రూపాయలతోపాట మొదలు కాగా షేక్.కరీముల్లా రూ.7.21లక్షల రూపాయలతో వాహనాల పాటను దక్కించుకున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు.



ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్.జిల్లాని భాష, పంచాయతీ కార్యదర్శి షరీఫ్, పాల్గొన్నారు.పాట దక్కించుకున్న వారు పంచాయతీ వారి నిర్ణయం ప్రకారం కారుకు 100రూపాయలు, ఆటోకు 50,రూపాయలు, బస్సుకు 120రూపాయలు, లారీకి 150రూపాయలు వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ నిర్ణయించిన రుసుమును కాదని వాహనాలకు అధిక రుసుము వసూలు చేస్తే చట్టమైన చర్యలను తీసుకుంటామన్నారు. అలాగే వేలం పాటను రద్దు చేసి మరొకరికి అవకాశం కల్పించే అధికారం పంచాయతీకి ఉందన్నారు.

## ఏఎస్ పేటలో తూనీకలు కొలతలు శాఖ తనిఖీలు

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని పలు గ్రామాల్లో తూనికలు కొలతలు శాఖ అధికారి షేక్.మోషిన్, తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఏఎస్ పేట టౌన్, హసనాపురం, చిరమన లో పలు దుకాణాలను తనిఖీ చేసా మని తెలిపారు. అలాగే ఆయా దుకాణాలలో వస్తువులపై



ప్రింట్ చేసి ఉన్న కొలతలలో తేడా ఉండడంతో చలానా విధించారు. తద్వారా వచ్చిన 25వేల నగదును ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరిగిందని లీగల్ మెట్రాలజీ అధికారి మోషిన్ తెలిపారు. అయితే తూనికల అధికారులు మెయిన్ బజార్‌లో తనిఖీలు నిర్వహించడం గమ నించిన దర్గా సెంటర్ లోని పలు దుకాణదారులు చుట్టుపక్కల ఉన్న దుకాణదారులు ఆగ మేఘాల మీద అంగళ్లు మూసివేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. దుకాణదారులు వస్తువులు తీసుకునే చోట రేట్లు, కొలతలు కరెక్ట్‌గా ఉండేటట్టు తీసుకొని జిఎస్టి, బిల్లులు పొందాలని అలాగే విక్రయించేటప్పుడు కస్టమర్లకు కొలతల్లో రేట్లలో ఎలాంటి పొరపాటులు లేకుండా చూడాలన్నారు. అలాగే వినియోగదారున్ని మోసగించే దుకాణదారులు ఉంటే తమకు సమాచారం అందించాలని కోరారు. అటువంటి దుకాణ యజమానులపై కేసులు నమోదు చేయడం తోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కొత్త టాప్‌లు ఏర్పాటు చేయండి : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో సోమవారం పర్యటనలో భాగంగా మార్గమధ్యంలో వీధి కుళాయి నుంచి వృధాగా నీరు కారిపోవడాన్ని గమనించి స్వయంగా కుళాయిని కట్టివేసారు. స్థానిక ప్రజలకు నీటి



ఆవశ్యకతపై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వాడకం అయిపోయిన తర్వాత వీధి కుళాయిలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా తప్పనిసరిగా కట్టివేయాలని కమిషనర్ సూచించారు. డివిజన్ పరిధిలో తాగునీటి కుళాయిల రిపేర్లు నూతనంగా అవసరమైన వాటి స్థానంలో కొత్త ట్యాప్‌లు ఏర్పాటు చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 134 ఫిర్యాదులు : జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో 134 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు,లీగల్ అడ్వైజర్ టీ.శ్రీనివాసులు రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్బీ 2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

- వేదాయపాలెం పరిధికి చెందిన వ్యక్తిని నెల్లూరుకు చెందిన గోళ్ళ బెనర్జీఏహర్షవర్ధన్ అనే వ్యక్తి పది లక్షల రూపాయలు నగదు తీసుకొని బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా వేదిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- కావలి పరిధికి చెందినటువంటి మహిళను కలిగిరిలోని ఓ హాస్పిటల్‌లో పనిచేసి మానేసినట్లు, కలిగిరికి చెందిన వేణు అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని చెప్పగా, ఒప్పుకోలేదని, మనసులో పెట్టుకొని, అసభ్యకరంగా నా ఫోటోలు ఇంస్టాగ్రామ్‌లో పెడుతూ వేధిస్తున్నాడని, వేణు, అతనికి సహకరించిన వారిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- నెల్లూరు రూరల్ పరిధికి చెందిన దివ్యాంగురాలని మనుబోలుకు చెందిన తాళ్లూరు రమణయ్య అనే వ్యక్తి తన బలహీనతను ఆసరాగా చేసుకుని నమ్మించి, తన ఇంటికి తీసుకెళ్లి, పలు విధాలుగా వేధించినట్లు తన నుండి రక్షణ కల్పించాలని కోరారు.
- కొండాపురం పరిధికి చెందిన మహిళను, మరి కొంతమందిని, కొండాపురంకు చెందిన తప్పెట మాలకొండయ్య అనే వ్యక్తి పలు రకాల సబ్సిడీ లోన్లు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరు వద్ద 35వేల నగదు తీసుకొని లోను ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- బుచ్చి పరిధికి చెందిన మహిళను తన భర్త అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తూ ఇంటింటి గెంటివేశారని విచారించి న్యాయం చేయాలని అదేవిధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ పొదలకూరులో పెళ్లి



చేసుకున్నట్లు, వివాహమైనప్పటి నుండి భర్త, అత్తింటివారు వేధిస్తున్నట్లు, తన బంగారం కూడా తీసుకొని బ్యాంకులో కుదరపెట్టినట్లు, ఇంటి నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.
- దర్గామిట్ట పరిధికి చెందినటువంటి 70 సంవత్సరాల వృద్ధురాలు మున్సిపల్ శాఖలో పని చేసి రిటైర్డ్ అయినట్లు, రిటైర్డ్ అనంతరం వచ్చినటువంటి మొత్తం నగదు తన పెద్ద కొడుకు శ్రీనివాసులు తీసుకుని, ఇప్పుడు పెన్షన్ డబ్బులకు కూడా ఇవ్వాలని వేధిస్తున్నట్లు అదేవిధంగా జలదంకి పరిధికి చెందినటువంటి వృద్ధ దంపతులను నాలుగో కుమారుడు వెంకటేశ్వర్లు తన పక్కింట్లో ఉంటూ తన జీవనాధారం కోసం ఇచ్చిన పొలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని, తన ఉన్న ఇంట్లో నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- దర్గా మిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క భార్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు, సదర విషయమై దర్గా మిట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు, తన భార్య ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

# కోటి సిద్దేశ్వర స్వామి కోనలో పోటెత్తిన జనం





**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని మొలకల పూండ్ల పంచాయతీ పరిధిలో గల శ్రీ సిద్దేశ్వర స్వామి కోనలో కార్తీక మాసం సందర్భంగా మూడవ సోమవారం. ఆధ్యాత్మికంగా దివ్యమైనది కార్తీక మాసం. ఈ కార్తీక మాసంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమాలు చేశారు. మాసాలన్నిటిలో ఉత్తమైన మాసంగా కార్తీక మాసాన్ని చూస్తారు. ఈ మాసంలో శివ కేశవులను భక్తులు పూజిస్తారు. సూర్యోదయానికి ముందే బ్రహ్మ ముహూర్తంలో అభ్యంగన స్నానం చేస్తారు. కార్తీక మాసంలో దీపం వెలిగిస్తే ఎంతో శుభకరమని భక్తులు నమ్మకం. ఇక ఈ మాసంలో శ్రీ నవ కోటి సిద్దేశ్వర స్వామి కోనలో గల ఆలయాలు భక్తులతో రద్దీగా మారింది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని భక్తులు కార్తీక మాస శోభ సంతరించుకుంది. ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇక భక్తులు తెల్లవారుజామునే ధ్వనుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్దేశ్వర స్వామి కోనలో కార్తీక మాసం పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి దర్శనార్థం జనం పోటెత్తారు. ఈ క్రమంలో సోమవారాల్లో శివారాధన చేస్తే మనఃశాంతి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇదిలా ఉంటే.. ఏపీలోని పలు ప్రాంతాల నుండి శ్రీ నవ కోటి సిద్దేశ్వరస్వామి కోనలో కార్తీక మాసం మూడవ సోమవారం ప్రారంభం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిద్దేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య ఆలయ కమిటీ సిబ్బంది. సిద్దేశ్వరస్వామి కోనకు వచ్చేటువంటి భక్తులకు ఇటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు కావలసిన మౌలిక సదుపాయాలు అన్నదాన కార్యక్రమాలు, నీటి సౌకర్యం, భక్తులు తొక్కిసి ఆటో లేకుండా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి పోలీసు బృందం ద్వారా తగు చర్యలు తీసుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకున్నామని ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో పోలీసుల పాత్ర చాలా కీలకమైనదని వారు వచ్చేటువంటి భక్తులను, ట్రాఫిక్‌లను సమర్థవంతంగా నిబద్ధత నిలిచి కృషి చేశారని, అదేవిధంగా వచ్చేటటువంటి ప్రతి భక్తుడికి దర్శనం నిదానంగా దర్శించుకునేలా ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నామని భక్త బృందానికి ఎక్కడ ఎటువంటి అవంతర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేగ రమణయ్య, ఆలయ కమిటీ సభ్యులు, వాలంటీర్స్, పోలీస్ సిబ్బంది, సర్పంచ్ వెందోటి శారద, ఉప సర్పంచ్ బులిగర్ల శివకుమార్ యాదవ్, అక్కని సతీష్, పొక్కాలా ప్రసాద్, వాసు, పట్నం గోపి, సర్పంచ్ భర్త రమేష్‌లు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# జరిగే ర్యాలీని జయప్రదం చేయండి : మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తున్నట్లు అందుకున్న సమాచారంమేరకు ప్రభుత్వ కళాశాలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రములోనే ఉన్న అన్ని జిల్లాలు నియోజక వర్గాలలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించాలని వారి ఆదేశాల మేరకు ఈ కోటి సంతకాల కార్యక్రమాన్ని ఈనెల 12వ తేదీన జరుగుచున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సోమవారం వైసీపీ కార్యాలయంలో పత్రికల పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు మభ్యపెట్టి మాయ చేసి ప్రజా వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్నారని, అందులో ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా నవంబర్ 12వ తేదీన జరగబోయే ర్యాలీలో కావలి పట్టణం, నియోజకవర్గ ప్రాంతాలలో వైసిపి నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో భారీగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్సు, జడ్పీటిసి, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ పట్టణ నూతన కమిటీకి అభినందనలు : మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మజీద్ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కావలి పట్టణ వైఎస్ఆర్సిపి నూతన కమిటీలను రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో ఈ నూతన కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కమిటీ ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేయాలని రానున్న 2029 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని వైసిపి ప్రభుత్వం అధికారులు ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మేలు ప్రస్తుతం ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రతి గృహానికి వెళ్లి వివరించాలని తెలిపారు. అనంతరం ప్రతి కార్యకర్త ఒక సైనికుడుగా పనిచేయాలని వారికి దిశ నిర్దేశాన్ని చేశారు. నూతన కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, పి.కామరాజు, వైకాపా జిల్లా కార్యదర్శి, గంధం ప్రసన్నాంజనేయులు, మాజీ ఫ్లోర్లీడర్ కె.నారాయణ, కే.రాజా జడ్పిటిసి జంపని రాఘవులు, పరుసు మాల్యాద్రి, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య అన్నపూర్ణ శీను, దామెర్ల నాగేశ్వరమ్మ, వెంగల్ శెట్టి కళ్యాణి, కార్యకర్తలు వైఎస్ఆర్సిపి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిరుధాన్యాల మేళాకు అందరూ ఆహ్వానితులే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న చిరుధాన్యాల మేళా కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి, మండలాలు నుండి సుమారు 200మంది రైతులును ఆహ్వానిస్తున్నట్టు వింజమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శేషగిరిరావు తెలియజేశారు. రేపు వింజమూరు గోనుగుంట కల్యాణ మండపంలో జరగబోవు ఈ చిరుధాన్యాలు మేళకు ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొంటారని తెలియజేశారు. కావున కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

## ఎన్ఎస్ఎస్ క్యాంపులో హోమియోవైద్య శిబిరం



**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** ఇనమడుగులోని జూనియర్ కళాశాలవారు దత్తతగా తీసుకోని వారం రోజులపాటు వివధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న చుండిగుంటలో ప్రభుత్వ హోమియోవైద్యులు వి.కరుణాకర్ ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ మధుబాబు ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫిసర్ వనజాకుమారి ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో స్టూడెంట్స్ వాలీంటీర్ లుగా ఇంటింటికి వెళ్లి క్యాంపుకి రోగులను తీసుకుని వచ్చారు. వాళ్లందరికి బీపీ చూసి ఆరోగ్యపరిక్షలు నిర్వహించి ఉచితంగా తగిన మందులను ఇవ్వడం జరిగింది. స్టూడెంట్స్ అందరూ గ్రామాన్ని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు ఆరోగ్య పరిశుభ్రత గురించి కరుణాకర్ అందరికి వివరించారు. ఇంటింటికి ఆరోగ్య సేవలను అందించారు స్టూడింట్స్ అందరికి ఎన్ఎస్ఎస్ గురించి, సేవ గురించి వాళ్ల బాధ్యతలగురించి వివరిస్తూ చైతన్య పరిచారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌రావు, ధనుంజయ, అన్నపూర్ణ, సుచరిత, భాను, సిద్ధయ్య, సుహాసిని, విధ్యార్ధి బృందం అంతా పాల్గొన్నారు. వారి అభ్యర్ధన మేరకు హోమియో క్యాంపును నిర్వహించినం దుకు కరుణాకర్‌ని కళాశాల బృందం అభినందించారు.

### పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో

# మొక్కలు నాటే కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కోవూరు పల్లి గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ ఆలయం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మాలే పార్టీ నాగేశ్వరరావు, బిట్రగుంట ఎస్సై ఎన్ ప్రభాకర్, కోవూరు పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామకృష్ణ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణంలో మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు చెట్లను నాటాలని తెలిపారు. చెట్లను నాటడం వల్ల కార్బన్డయాక్సైడ్ చెట్లు తీసుకుని మనకు కావలసిన ఆక్సిజన్ ను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు పల్లి టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు భాస్కర్ రెడ్డి, నాటకరాణ నాటక రాణి రంగయ్య, నాటక రాణి సీనయ్య, సుబ్బారావు, శివ, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం, వైద్యవిద్యను పేదలకు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

## వైసిపి పట్టణ అధ్యక్షుడు నాగులపాటి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైద్యాన్ని, వైద్య విద్యను కూటమి ప్రభుత్వం పేదలకు దూరం చేస్తుందని ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నాగులపాటి ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో రాష్ట్రానికి ఎన్నడూలేని విధంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజిలను సాధించారన్నారు. కాగా ప్రభుత్వం మెడికల్ కాలేజిలను కూటమి ప్రభుత్వం ప్రవేటుపరం చేసేలా నిర్ణయించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి, తమ నాయకుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇంటింటా పర్యటిస్తున్నామని, ప్రవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సంతకాలద్వారా సేకరిస్తున్నామని, పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజిలను ప్రవేటీకరణకు కూటమి ప్రభుత్వం పూనుకోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈప్రవేటీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు సాగిస్తామని, అందులోభాగంగా కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రంలో పేదలందరికి కార్పోరేట్ విద్య, కార్పోరేట్ వైద్యం అందాలన్న సంకల్పంగా ఫీజ్ రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు అమలుచేశారని, ఆయన ఆశయసాధనకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈపథకాలను మరింతగా విస్తృతపరిచి అమలు చేశారని, నాడు-నేడు కార్యక్రమంలో విద్యాసంస్థలను రూపురేఖలు మార్చారని, ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారని, కార్పోరేట్ హాస్పిటల్స్‌లో సేవలతోపాటు గ్రామీణ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అనాదిగా ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా కేవలం 11మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా జగన్మోహన్‌రెడ్డి 17మెడికల్ కాలేజీలను సాధించారని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటుకు దారాదత్తం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమం సాగిస్తామని, ప్రజలనుండి సంతకాలు సేకరిస్తున్నామని, ప్రతాప్‌రెడ్డిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటీకరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత దుర్మార్గమని, అన్యాయమని, పేదలకు



తీవ్ర నష్టదాయకమని నాగులపాటి పేర్కొన్నారు. మెడికల్ కాలేజిలకు అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కూడా ఉంటాయని, పేదలకు వైద్యవిద్య, వైద్యం లభిస్తాయని తమ నేత జగన్మోహన్‌రెడ్డి రికార్డుస్థాయిలో 17మెడికల్ కాలేజిలు సాధించారని ఆయన పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రవేటీకరణ గావించబూనడం అత్యంత విచారకరమన్నారు. పేదలకు వైద్యవిద్య అందనిద్రాక్షలాగా మారుతుందన్నారు. ఈ ప్రవేటీకరణను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో తాము పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్తు ప్రభుత్వ సంకల్పం

## ప్రజలతో మమేకంకావడం లక్ష్యం : ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో విద్యాసంస్థలను బలోపేతం చేయాలి, విద్యార్థులు నాణ్యమైన విద్య పొంది ఉజ్వలభవిష్యత్తు పొందాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులంతా ప్రజలతో మమేకపై పథకాలను పర్యవేక్షించాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం తనవార్డు పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించడంతోపాటు ఆయన కూడా ప్రధానోపాధ్యాయిని సీహెచ్, అనంతలక్ష్మి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటకాలు శుచిగా, శుభ్రతగా, రుచిగా ఉన్నాయని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూరా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు పొందాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖామంత్రి లోకేష్‌లు అనేక మార్పులు, సంస్కరణలు తెచ్చారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో వాటి అమలుకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిరంతరం అధికారులతో చర్చిస్తుంటారని, టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు తెలుసుకోవాలని, వాటిని అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని ఆయన పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, నాణ్యమైన విద్యతో వారు అందలం ఎక్కడం ఖాయమని సూరా పేర్కొన్నారు. పాఠశాలలను కూడా పరిశీలించి ఏదేని సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఉన్నతపాఠశాలలో ప్రభుత్వం అమలుచేస్తున్న డొక్కాసీతమ్మ విద్యార్థుల మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించానని, వంటకాలు రుచికరంగా ఉన్నాయని, సంతృప్తికరంగా ఉన్నాయా అని ఆయన విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సూరా తనస్వంత నిధులతో 500 అరటి పండ్లను సమకూర్చి అందజేశారు. ప్రధానోపాధ్యాయిని విద్య పట్ల, భోజనం పట్ల అత్యంత శ్రద్ధచూపుతుంటారని విద్యార్థులు ఆయనకు తెలుపగా ఎంతో సంతృప్తి చెందారు. మధ్యాహ్న భోజనాన్ని ఇదేమాదిరిగా నిర్వహించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. భోజన నిర్వాహకురాలు షమీమా, ఉపాధ్యాయులు కౌన్సిలర్ సూరా విద్యార్థులకు అరటి పండ్లను సమకూర్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు నాగులూరు చిన్నబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ క్యాంపును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు డైకాస్ రోడ్డు సమీపంలోని క్యాంపు కార్యాలయంలో ముత్తుకూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దువ్వూరు కృష్ణతేజ రెడ్డి, సీపారెడ్డి జానకిరామ్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు నోవా బ్లడ్ బ్యాంకు మోపూరు భాస్కర్ నాయుడు తెలిపారు. కాకాని నివాసం వద్ద సోమవారం సాయంత్రం



ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు 504 మంది రక్తదానం చేశారని వివరించారు. యువత నుంచి పెద్ద ఎత్తున ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారన్నారు. రక్తదాన ఉద్యమంలో యువత ప్రాధాన్యతను గుర్తు ఉంచుకొని ఈ క్యాంపును ఏర్పాటు చేయటం ఎంతో ఆనందదాయకమన్నారు. తమకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో దూడల సుధీర్, బావిశెట్టి వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరును జిల్లా చేయాలి

- మండలాన్ని రూరల్‌గా మార్చాలి
- వీర్లగుడిపాడు మండలం మార్చాలి
- మంత్రుల ఉపసంఘం పరిశీలించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ కేంద్రంగా, డివిజన్ కేంద్రంగా ఉన్న ఆత్మకూరును జిల్లాకేంద్రంగా మార్చాలని, ఆత్మకూరు మండలాన్ని రూరల్‌మండలంగా మార్చాలని, సంగం మండలంలోని వీర్లగుడిపాడు గ్రామాన్ని సమీపంలో ఉన్న ఆత్మకూరు మండలానికి మార్చాలని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కోరుతున్నారు. అనాదిగా ఈకోర్కెలు ఉన్నా ఇటీవల జిల్లా, మండల మార్పుల పరిశీలనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించడంతో వారు పరిశీలించేలా వారికి ఒక వినతిపత్రం అందించేలా యోచిస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు డివిజన్ కేంద్రంగా, నియోజకవర్గ కేంద్రంగా, నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఉంది. జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఉంది. ఆర్డీఓ, డీఎస్పీ, వివిద శాఖల డివిజన్ కార్యాలయాలతో ఉంది. సమీపంలో పెన్నానది ఉంది. అవసరమైన స్థలాల అవకాశం ఉంది. శ్రీకాళహస్తి-నడికుడి రైలుమార్గం ఆత్మకూరు మీదుగా రానుంది. రెండు జాతీయ రహదారులున్నాయి. అన్నివసతులు, వనరులు ఉన్న ఆత్మకూరును జిల్లా కేంద్రంగా మార్చితే రెండు నియోజకవర్గాలకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. మంత్రివర్గ ఉపసంఘ ప్రతినిధులు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛగా ఉన్న ఆత్మకూరును జిల్లాగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో జిల్లాలు నూతనంగా ఏర్పాటు చేసినసమయంలో పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం అనగా నేడు ఈ నిబంధనలు సడలించినందున ఆత్మకూరును పరిశీలించాలని కోరుతున్నారు. కాగా ఆత్మకూరు మండలం గతంలో పట్టణంతోసహా 24పంచాయతీలతో ఉండేది. ఆత్మకూరును మున్సిపాలిటీగా మార్చినందున మిగతా 21పంచాయతీల మండలాన్ని ఆత్మకూరు రూరల్ మండలంగా నామకరణం చేయాలని, ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు రూరల్ మండలంగా ఉంటే అందరికి సౌలభ్యంగా ఉంటుందని భావిస్తున్నారు. కాగా ఆత్మకూరుకు కేవలం 3కిలోమీటర్లలో ఉన్న వీర్లగుడిపాడు గ్రామం ప్రస్థుతం దూరంగా ఉన్న సంగం మండలంలో ఉంది. వారు మండలకేంద్రానికి వెళ్ళాలంటే ఆత్మకూరు మీదుగా 32కిలో మీటర్లదూరం ప్రయాణించి వెళ్ళడం అత్యంత అసౌకర్యంగా ఉంటోంది. ఆగ్రామస్థులు వ్యవసాయ, ఇతరత్రా వ్యాపారలావాదేవీలు ఆత్మకూరులోనే కొనసాగిస్తుంటారు. కానీ మండల కేంద్రానికి మాత్రం ఇబ్బందిపడుతూ వెళుతుంటారు. అందువలన వీర్లగుడిపాడు గ్రామాన్ని ఆత్మకూరు మండలంలో చేర్చితే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఈమార్పుల గురించి మంత్రివర్గ ఉపసంఘ ప్రతినిధులు పరిశీలించాలని సర్వత్రా కోరుతున్నారు.

# జర్నలిస్ట్‌పై దాడి హేయమైన చర్య

**కావలి, మేజర్‌న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలంలో ప్రజాశక్తి రిపోర్టర్‌గా పనిచేస్తున్న శంకర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని కావలి ప్రాంతీయ కమిటీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. సోమవారం మండల సిపిఎం పార్టీ కార్యాలయంలో ప్రజాశక్తి రిపోర్టర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 45 లక్షలతో సీసీ రోడ్లును టిడిపి మండల నాయకులు నాగరాజు యాదవ్ వేశారు. సీసీ రోడ్లలో నాణ్యత లేకపోవడంతో ఆ మండలంలో పనిచేస్తున్న ప్రజాశక్తి రిపోర్టర్ శంకర్ వార్తను రాయడంతో అతనిపై నాగరాజు యాదవ్ వారి అనుచరులు కాపు కాచి అతనిపై కర్రలతో విచక్షణ రహితంగా దాడికి పాల్పడడం హేయమైన చర్యని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా పనిచేస్తున్న నిజాయితీగల జర్నలిస్టులపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రభుత్వానికి సిగ్గుచేటని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ జర్నలిస్ట్ సంఘాలు ఐక్యతతో ఉద్యమ రూపంలో ముందుకు తీసుకొని వెళ్లి ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని తెలిపారు. జర్నలిస్ట్ పై జరిగిన దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ బోగోలు సీపీఎం పార్టీ ఖండిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్షులు చల్ల నరహరి, సిఐటియు కార్యదర్శి ఎస్‌కె బాదుల్లా, సిఐటి ఉపాధ్యక్షులు అన్వర్‌భాష, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి రామయ్య, కడనూతల శాఖ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్



**నెల్లూరు అర్బన్, మేజర్‌న్యూస్ :** పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతోపాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌వో విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపుకార్డులు పంపిణీ

జిల్లా దివ్యాంగులు, వృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుమారు 30మంది ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ హిమాన్షు శుక్ల ధ్రువీకరణ పత్రాలను, గుర్తింపుకార్డులను పంపిణీచేశారు. 2019 హిజ్రాల చట్టం ప్రకారం హిజ్రాలకు సమాజంలో గౌరవం కల్పించాలనే లక్ష్యంతో అధికారిక గుర్తింపు పత్రాలు, ఐడెంటిటి కార్డులను నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ పోర్టల్ ద్వారా మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్ చెప్పారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా వికలాంగుల తరహాలో హిజ్రాలకు కూడా రూ.6వేలు పింఛన్‌ను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. అలాగే నకిలీ హిజ్రాలను గుర్తించవచ్చన్నారు. దేశంలో ఎక్కడైనా ఈ గుర్తింపుకార్డు ఉపయోగపడుతుందన్నారు.



### దివ్యాంగుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్

జిల్లా కలెక్టరు కార్యాలయానికి సమస్యలు చెప్పుకునేందుకు విచ్చేసిన పలువురు దివ్యాంగుల వద్దకే కలెక్టర్ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం పేరుతో జిల్లాకు సంబంధం లేని ఒక వ్యక్తి విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను పలురకాలుగా వేధిస్తున్నారని, వికలాంగులను చిన్నచూపు చూస్తున్నారని దివ్యాంగులు కలెక్టరుకు విన్నవించారు. స్పందించిన కలెక్టరు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# రైతులకు యూరియాకొరత లేకుండా చూడాలన్నదే లక్ష్యం : కేతా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆమేరకు ఆత్మకూరు నియోజకవర్గంలో రైతులకు సమృద్ధిగా యూరియా అందించేలా రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిత్యం జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటున్నారని ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకుడు, చెర్లోయడవల్లి మాజీ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు కేతా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యవేక్షణలో మండలంలోని చెర్లోయడవల్లిలో విజయభాస్కర్‌రెడ్డి రైతుసేవాకేంద్రం వద్ద రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరం మేరకు యూరియా వచ్చేలా మంత్రి చర్యలు తీసుకుంటున్నారని, తాము కూడా అధికారులతో మాట్లాడుతున్నామని, జిల్లా వ్యవసాయాధికారిణి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌లతో నిరంతరం అందుబాటులో ఉంటూ చర్చిస్తున్నామని ఆయన తెలిపారు. పిఏసిఎస్‌లు, ఆత్మకూరు సిండికేట్ రైతు సేవా సహకార సంఘం, రైతుసేవాకేంద్రాల ద్వారా రైతులకు అవసరం మేరకు యూరియా అందేలా చూస్తున్నామని విజయభాస్కర్‌రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం వరి నార్లు పోసుకుంటున్న రైతులు అవసరం మేరకు యూరియా తీసుకుంటే వరి సాగునాటికి సమృద్ధిగా యూరియా వారికి అందుతుందని, ఎలాంటి దుర్వినియోగం



జరుగకుండేలా ప్రభుత్వం యూరియా సరఫరాకు కార్డు విధానం అమలు చేస్తుందని విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది, గ్రామనాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు పెంచినా.. ఆత్మకూరులో ముందుకుసాగని గృహనిర్మాణం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో ఏడాదిన్నరకాలంగా మంజూరైన పక్కాగృహాల నిర్మాణం పరిస్థితి చూస్తుంటే ఏమాత్రం ముందుకు సాగడం లేదు. మండలంలో ఇటీవల పరిశీలిస్తే కేవలం 18.6శాతం గృహాలు మాత్రమే పూర్తికాగా 24 గృహాల పనులు ప్రారంభం కాకపోగా 352గృహాలు పునాదులకే పరిమితమై ఉన్నాయి. నుడా, పిఎంఏవై పథకాల ద్వారా ఆత్మకూరు మండలానికి 2024-25 ఆర్థిక సంవత్సరంకు గాను 569గృహాలు ప్రభుత్వం నుండి మంజూరయ్యాయి. మండలంలోని అప్పారావుపాళెంకు 6, ఆరవేడుకు 1, బండారుపల్లికి 26, బట్టేపాడుకు 34, బోయలచిరువెళ్ళకు 55, చెర్లోయడవల్లికి 45, దేపూరుకు 2, కరటంపాడుకు 59, మహిమలూరుకు 105, మురుగుళ్ళకు 21, నాగులపాడుకు 4, నల్లపురెడ్డిపల్లికి 7, నారంపేటకు 8, నువ్వురుపాడుకు 8, పడకండ్లకు 23, పమిడిపాడుకు 4, రావులకొల్లుకు 3, వాసిలికి 76, వెన్నవాడకు 5 ఇళు ్ళ మంజూరయ్యాయి. అందులో 106గృహాల నిర్మాణాలు పూర్తికాగా 24 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 352గృహాలు పునాదులకన్నా తక్కువలో నిలిచిపోయి ఉన్నాయి. 35గృహాలు పునాదుల స్థాయిలో, 9గృహాలు లింటిల్‌లెవల్‌లో, 19గృహాలు రూఫ్‌లెవల్‌లో, 27గృహాలు శ్లాబ్‌లెవల్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో గృహానికి 1.80లక్షల రూపాయలు వంతున మంజూరు చేస్తుండగా ఇటీవల అదనంగా బిసిలు, ఎస్‌సిలకు 50వేలరూపాయలు, ఎస్‌టిలకు 70వేల రూపాయల వంతున మంజూరుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా గృహనిర్మాణంలో పురోగతి అత్యంత నీరసంగా కన్పిస్తోంది. కాగా మండలంలో గృహాలు మంజూరు చేయాలంటూ ఆన్‌లైన్‌లో 919మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 569మంది మాత్రమే తగిన డాక్యుమెంట్లు జతపరచగా మిగతావారు జతపరచలేదు. మండలంలోని అప్పారావుపాళెంలో ఆరుగృహాలకుగాను 2పూర్తయ్యాయి. ఆరవేడులో 1గృహంకాగా అది పూర్తయింది. బండారుపల్లిలో 26కుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. బట్టేపాడులో 34గృహాలకుగాను 3పూర్తయ్యాయి. బోయలచిరువెళ్ళలో 55గృహాలకుగాను 9పూర్తయ్యాయి. చెర్లోయడవల్లిలో 45గృహాలకుగాను 15పూర్తయ్యాయి. దేపూరులో 2ఇళ్ళకుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. కరటంపాడులో 59గృహాలకుగాను 3పూర్తయ్యాయి. మహిమలూరులో 165గృహాలకుగాను 17పూర్తయ్యాయి. మురుగుళ్ళలో 21గృహాలకుగాను ఆరు పూర్తికాగా నాగులపాడులో నాలుగు గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నల్లపురెడ్డిపల్లిలో 7గృహాలకుగాను ఐదు పూర్తయ్యాయి. నారంపేటలో 8గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నువ్వురుపాడులో 8గృహాలకుగాను నాలుగు పూర్తయ్యాయి. పడకండ్లలో 23 ఇళ్ళకుగాను 9పూర్తికాగా పమిడిపాడులో 4ఇళ్ళకుగాను నాలుగు పూర్తికాగా రామస్వామిపల్లిలో 17కుగాను ఒక్కటి, రావులకొల్లులో 3కుగాను 3, వాసిలిలో 76కుగాను 18, వెన్నవాడలో 5కుగాను 3పూర్తయ్యాయి. అర్హులందరికీ అవసరమైనన్ని గృహాలు మంజూరుచేయించేందుకు ఆత్మకూరు అభివృద్ధిప్రదాత, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిద్ధంగా ఉండగా గృహాలను వెంటనే ప్రారంభించి పనులు పూర్తిచేయాలని పదేపదే అధికారులు కోరుతున్నా ఆత్మకూరు మండలంలో గృహనిర్మాణం అత్యంత నత్తనడకన సాగుతోంది. మరి పురోగతి లభిస్తుందో లేదో చూడాల్సి ఉంది. అదీగాక లబ్దిదారులకు గతంలో లేఅవుట్‌లలో స్థలాలు కేటాయించి ఉన్నా వారు స్వంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయినా లక్ష్యసాధనలో ఫలితం నిరాశాజనకంగా ఉంది.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 53 అర్జీలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వైఓ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు టిడ్కో గృహ సముదాయాలలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేసి త్వరలో ప్రజలకు అందించనున్నామని తెలిపారు. టిడ్కో గృహాల కోసం అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని, స్థానిక సచివాలయంలో అమెనిటీస్ కార్యదర్శిని లేదా నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండవ అంతస్తులోని హౌసింగ్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ పథకం ఆవశ్యకతను గుర్తించి అనధికార లేఔట్ల యజమానులు, స్థలాల యజమానులు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్దేశించిన క్రమబద్ధీకరణ విధానం ద్వారా యాజమాన్యపు హక్కులను పొందాలని కమిషనర్ సూచించారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ పథకాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. నెల్లూరు నగర పాలక సంస్థకు సంబంధించిన అన్ని పౌర సేవలను పురమిత్ర యాప్ ద్వారా సులభతరంగా అందిస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ ఫోన్‌లో పురమిత్ర యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని ఆన్‌లైన్‌లో



సేవలు పొందాలని కమిషనర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 1, ఆప్కాస్ 6, ఇంజనీరింగ్ 10, హౌసింగ్ సెక్షన్ 23, పెన్షన్ 1, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 3, టౌన్ ప్లానింగ్ 5, మొత్తం 53 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ రహంతు జానీ, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథరావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టీపీఆర్ఓ వాసు బాబు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నగర అభివృద్ధే లక్ష్యంగా దూసుకుపోతున్న మంత్రి నారాయణ

## డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ దీన్ దయాల్ నగర్ నందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైనేజి పనులకు నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూప్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని 4వ డివిజన్, దీన్ దయాల్ నగర్, 152వ బూత్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. నగర తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్, 4వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మామిడాల మధు, డివిజన్ ప్రెసిడెంట్ ఆది నారాయణరెడ్డి, సెక్రటరీ మాల్యాద్రి, బూత్ కన్వీనర్ శివయ్య స్థానిక మహిళా నాయకురాలు మంజుల, లక్ష్మితో కలిసి సీసీ డ్రైనేజీ రోడ్డు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగర నియోజకవర్గ పరిధిలో మంత్రి అమరావతి రాజధానిలో బిజీగా ఉన్నప్పటికీ తనని అత్యధిక మెజారిటీతో గెలిపించిన నెల్లూరు నగర ప్రజలకి అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ఆలోచనతో నెల్లూరు నగరాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని ఒక ఆలోచనతో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా కూడా శక్తివంచన లేకుండా తన యొక్క విస్తృత పరిచయాలతో అటు అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచే కాకుండా అదేవిధంగా ఇతర పెద్ద పెద్ద కంపెనీలతో మాట్లాడి సీఎస్ఆర్ ఫండ్స్ నుండి అలాగే తన సొంత నిధులతో కూడా అనేక ప్రాంతాల్లో పర్యటించి నెల్లూరు నగరాన్ని మంత్రి నారాయణ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నానన్నారు. దీన్ దయాల్ నగర్ ప్రాంతం పూర్తిగా గిరిజనులు నివసించే ప్రాంతంలో కూడా మంత్రి నారాయణ సంకల్పంతో ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా నగర తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్, 4వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మామిడాల మధు మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు చూస్తుంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎక్కడ లేనటువంటి అభివృద్ధి ఒక్క నెల్లూరు నగరంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు తెలుగుదేశం పార్టీ నగర ప్రెసిడెంట్, 4వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మామిడాల మధు, 4వ డివిజన్ ప్రెసిడెంట్ ఆదినారాయణ రెడ్డి, సెక్రటరీ మాల్యాద్రి, బూత్ కన్వీనర్ శివయ్య, మహిళా క్లస్టర్ మంజుల, లక్ష్మి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేస్తే చర్యలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 14వ డివిజన్ ఏసీ నగర్ ప్రాంతంలోని ఎంఎస్ఎం పార్కు పరిసర ప్రాంతాలలో సోమవారం పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న అపార్ట్మెంట్ నిర్మాణాన్ని కమిషనర్ పరిశీలించి నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన అనుమతులను పరిశీలించారు. అపార్ట్మెంట్‌కు సంబంధించి వేకంట్ ల్యాండ్ టాక్స్ చెల్లింపులను తనిఖీ చేశారు. నిర్దేశించిన అనుమతుల మేరకే నిర్మాణం చేపట్టేలా సంబంధిత సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని, నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



14వ డివిజన్ లోని వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి క్లోరిన్ శాతన్ని, పరిశుభ్రత ను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, తదీతరులు

### 42 మంది ప్లానింగ్ కార్యదర్శులకు

# షోకాజు నోటీసులు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు 42 మంది సిబ్బందికి షోకాజు నోటీసులను సోమవారం జారీ చేశారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి వీరంతా హాజరుకాని కారణంగా సంజాయిషీ వివరణ 24 గంటల లోపల అందజేయాలని కమిషనర్ ఆదేశించారు.

## పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో వెలసి ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, భస్మాభిషేకం, సహస్ర దీపాలం కరణ, జ్వాలాతోరణం, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే ఉదయగిరి పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయం. మండలంలోని లింగాల దొనక్షేత్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ, గుడినరవ, అప్పసముద్రం తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## 200 మంది భక్తులకు అన్నసంతర్పణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసంలో భక్తులకు సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. పైనంపురం శివాలయంలో అన్నదానం కార్యక్రమాన్ని దాతలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తుల తోపాటు శివయ్య, భవాని భక్తులు హాజరై అన్నదానం స్వీకరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. దాతలను భక్తులు ఆశీర్వదించి ఆశీస్సులు అందించారు.

### తహసీల్దార్ కార్యాలయం చుట్టూ

# కాళ్ళు అరిగేలా తిరుగుతున్నాం..



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీలో నివాసం ఉంటున్న కుండా వెంకట సుబ్బయ్య పొలంకి సంబంధించి సర్వే నెంబర్ 435-4లో 2ఎకరాల 76సెంట్లు పట్టాలో భూమి ఉంటే సాగులో తక్కువ ఉందని, దానికి సంబంధించి హద్దులు చూపమంటే చూపడం లేదని ఆరోపించారు. రెవిన్యూలో నెలకొన్న సమస్యలపై దాదాపుగా మూడు సంవత్సరాలనుండి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని మీడియా ముందు వాపోయారు. న్యాయం కోసం మా పోరాటం అంటూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసారు. తన పొలంకి సంబంధించి హద్దులు చూపించేందుకు పలుమార్లు సర్వేయర్లును పిలిచినా హద్దులు చూపించకుండా వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఉన్నతధికారులు మా గోడును ఆలకించి మాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నామన్నారు.